క్లుప్తంగా

అభివృద్ధి, సంక్షేమం మా లక్ష్యం

ఎమ్మెల్యే యరపతినేని



దాచేపల్లి : అభివృద్ధి, సంక్షేమం మా లక్ష్యమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విజయభాస్కర్ కల్యాణ మండపంలో ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. నగర పంచాయతీతో పాటు గ్రామాల వారీగా చేపట్టాల్సిన పనులపై అధికారులతో చర్చించారు. గ్రామాల వారీగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా దర్బార్, కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమస్యలపై ప్రజలు వస్తే సానుకూలంగా అధికారులు స్పందించాలని, ప్రజలను అగౌరవపరచిన, అవమానించిన సహించనని ఎమ్మెల్యే అన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

గురజాల: స్థానిక శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం గురజాల మండలంలో పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావులు తెలిపారు. స్థానిక చల్లగుండ్ల గార్డెన్‌లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పిడుగురాళ్ల: పట్టణంలోని కేఎస్‌ఆర్ విద్యా సంస్థలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కేఎస్‌ఆర్ విద్యా సంస్థలు, యరపతినేని చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యరపతినేని చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బాషా మాట్లాడుతూ విద్యార్థులకు ఎప్పుడు ఏ అవసరమొచ్చినా తనను సంప్రదించాలని చెప్పారు. యరపతినేని చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థుల కోసం పాటు పడుతూనే ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేఎస్‌ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్లు కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈడీస్ దోమ కాటు వలనే డెంగీ



సత్తెనపల్లి: వర్షాకాలం వచ్చిందంటే వ్యాధుల కాలం ఆరంభమైనట్లేనని, ఈడీస్ అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాపిస్తుందని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ అన్నారు. సత్తెనపల్లి మండలం ఫణిదం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో సోమవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ ఈడీస్ దోమ కాటు వల్ల డెంగీ వ్యాపిస్తుందని, వైరల్ మాదిరిగా అకస్మాత్తుగా జ్వరం వస్తుందన్నారు. తల నొప్పి, ఒళ్లు నొప్పులు, ఎముకలు విరిగేటంత నొప్పి ఉంటుందన్నారు. ఒక్కోసారి శరీర అంతర్భాగాల్లో రక్తస్రావం ఉంటుందన్నారు. కాళ్లు, చేతులు, ముఖం, వీపు, ఉదర భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లు చిన్నపాటి పొక్కులు వస్తాయన్నారు. ప్లేట్‌లెట్స్ పడిపోయి రోగి పరిస్థితి విషమంగా మారుతుందన్నారు. పూల కుండీలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు, టైర్లు వంటి వాటిల్లో చేరిన వర్షపు నీటిలో ఈడీస్ దోమలు వృద్ధి చెందుతాయన్నారు. కనుక పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమ తెరలు వాడటం మేలని, వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించాలన్నారు. జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పి.శ్రీనివాసరావు, పీహెచ్‌ఎన్ జీవీసీకే మీనాక్షమ్మ, ఆరోగ్య పర్యవేక్షకురాలు ఏ వరలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ కిచెన్ గార్డెన్ విత్తనాలు పంపిణీ

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆర్గానిక్ కిచెన్ గార్డెన్‌కు సంబంధించి ఆకుకూరలు, కాయగూరల విత్తనాలను ఎన్నారై పాఠశాల అభివృద్ధి దాత గుత్తికొండ గురువారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి ద్వారా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం అనపరెడ్డి శ్రీనివాసరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు అరుణశ్రీ మాట్లాడుతూ పురుగు మందులు లేకుండా, ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించేలా విద్యార్థులకు అవగాహన కోసం పాఠశాలలో మన బడి–సాగుబడి నిర్వహిస్తున్నామన్నారు. పాలకూర, చుక్కకూర, బీర, బెండ, దోస, తదితర విత్తనాలను ఎన్నారై గురువారెడ్డి సహకారంతో అందించామన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. విత్తనాలు అందజేసిన దాత గురువారెడ్డికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పలు ప్రాంతాల్లో పింఛన్‌ల పంపిణీ



రెంటచింతలలో పింఛన్ పంపిణీ చేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, వీఆర్వో లింగయ్య



పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు



రెంటచింతలలో పింఛన్ పంపిణీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి గబ్రూనాయక్, ఎంపీడీవో

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో నున్న గ్రామ సచివాలయ సిబ్బందితో 90 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేసినట్లు మండల ప్రత్యేక అధికారి గబ్రూనాయక్, ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు సోమవారం తెలిపారు. 11 గ్రామాలకు సంబంధించి వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర పింఛన్‌దారులు మొత్తం 7,074 మంది ఉన్నారని, వారికి గ్రామ సచివాలయ, పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తల సహకారంతో 90 శాతం మందికి పింఛన్‌లు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రామాలలోని ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెంచిన పింఛన్‌లు అందజేసినట్లు మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో టీడీపీ నాయకులు క్షేత్రస్థాయి అధికారులతో కలిసి పింఛన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, వీఆర్వోలు, మండల టీడీపీ అధ్యక్షులు సీహెచ్ అబ్బిరెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్ రెడ్డి, బొడపాటి రామకృష్ణ, మున్నా ప్రభురాజు, శీలం మల్లయ్య, మూలి రాజా రెడ్డి, మర్రి రాజ్‌కుమార్, మొండెద్దు చిన శౌర్రెడ్డి, ఓరుగంటి ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పింఛన్ల పంపిణీ

దాచేపల్లి: మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం చేపట్టారు. నగర పంచాయతీతో పాటు గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి ప్రభుత్వ అధికారులు పింఛన్ నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు బెల్లంకొండ బద్రి, తంగెళ్ల శ్రీనివాసరావు, అంబటి శేషగిరిరావు, నెల్లూరి రామకోటయ్య, సొసైటీ నారాయణ, బుల్లెబ్బాయి, నర్రా పుల్లయ్య, కొగంటి శివన్నారాయణ, వేముల తిరుమలకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పంపిణీ

గురజాల: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు పింఛన్ పెంచి అందించడం జరిగిందని టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సామాజిక పింఛన్లను ఇంటింటికి తిరిగి సోమవారం సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలల పెంచిన పింఛన్‌తో కలిపి మొత్తం పింఛన్‌ను పింఛన్‌దారులకు అందించడం జరిగిందన్నారు. అవ్వాతాతల మోముల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. ప్రతి ఒక్కరు ఎంతో ఆనందంగా పింఛన్ తీసుకున్నారన్నారు. ఏపీ అభివృద్ధిలో ముందుకు వెళ్లాలంటే సీఎంగా చంద్రబాబు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు నేలవల్లి బుల్లయ్య, చాగంటి శ్రీనివాసరావు, కోట్టే శ్రీనివాసరావు, చింతకాయల కళ్యాణ్, జూకూరి బ్రహ్మం, కందిమళ్ల రామకృష్ణ, శరమాళ్ల హనుమంతరావు, చింతకాయల దానయ్య, సోలసా కిషోర్ తదితరులున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందజేస్తున్నాం

ఎమ్మెల్యే యరపతినేని



పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందజేస్తున్నామని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 9, 17, 19, 27, 25 వార్డులలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మనకు ఇచ్చింది అధికారం కాదని వాళ్లకు సేవ చేసే బాధ్యత అని ఆయన అన్నారు. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేసి క్షేత్ర స్థాయిలో ప్రజలకు అండగా ఉంటామని విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులు, కార్యకర్తల సేవలు పార్టీ ఎన్నటికీ మరిచిపోదని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా రూ.4 వేల పెన్షన్ అందజేస్తుందని, మొదటి నెల ఏప్రిల్ నుంచి మూడు నెలల రూ.వెయ్యి కలిపి మొత్తం రూ.7 వేలు అందజేయటం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కమిషనర్ గిరిబాబు, సచివాలయ సిబ్బంది, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే జూలకంటి



దివ్యాంగురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల: పట్టణంలోని పదో వార్డు చిన్న కాన్వెంట్ సమీపం నుంచి కేసీపీకి వెళ్లే రహదారిలో ఉన్న పింఛన్ లబ్ధిదారులకు సోమవారం ఉదయం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి రూ.7 వేలు పింఛను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రస్తుతం రూ.4 వేలు పింఛన్ ఇస్తుందన్నారు. ఏప్రిల్ నుంచి నేటి వరకు పింఛను రూ.7 వేలు ఇవ్వడం జరిగిందన్నారు. దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ అందజేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. పట్టణంలో ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది పింఛన్ పంపిణీ చేశారు.

కారెంపూడిలో ...

కారెంపూడి: మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి కారెంపూడి ఎస్సీ కాలనీలో కొందరికి పింఛన్లు పంపిణీ చేశారు. పెంచిన పింఛన్ ప్రకారం ఒక్కొక్కరికి రూ.7 వేలు చొప్పున పంపిణీ చేశారు. అలాగే అన్ని గ్రామాలలో ఎంపీడీవో, ఈవోపీఆర్డీ ఇతర అధికారుల పర్యవేక్షణలో గ్రామ సచివాలయాల ఉద్యోగులు పింఛన్లను ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. పలు గ్రామాలలో టీడీపీ నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. పలు చోట్ల జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, వివిధ హోదాల పార్టీ నాయకులు గోళ్ల సురేష్, తండా మస్తాన్ జానీ, పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, కర్ణా సైదారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కేసానుపల్లి కృష్ణబాబు, ఎస్‌ఎంకే నాయుడు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఈ గుంత పూడ్చరూ...



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామం నుంచి గురజాల వెళ్లే ఆర్ అండ్ బీ రహదారిపై లక్ష్మీపురం గ్రామం సమీపంలో నడి రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. దాదాపు రోడ్డు మొత్తం కోసుకు పోయి పెద్ద గుంత ఏర్పడింది. దీంతో ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు బాగా ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వాహనాల రాకపోకలకు సైతం ఇది ఇబ్బందికరంగా ఉంది. ఈ గుంత పూడ్చి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నాగయ్య సేవలు అభినందనీయం



ఎంఈవో వేముల నాగయ్యను సన్మానిస్తున్న ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు

మాచర్లరూరల్: అన్ని వృత్తుల వారిని తయారు చేయు అత్యున్నతమైన ఉపాధ్యాయ వృత్తికే వన్నె తీసుకొచ్చిన విద్యాశాఖాధికారి వేముల నాగయ్య సేవలు అమూల్యమని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు కొనియాడారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పదవీ విరమణ చేస్తున్న ఎంఈవో వేముల నాగయ్యను వారు సన్మానించి మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు దోహదపడి, విద్యాశాఖాధికారిగా వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం విశిష్టమైన సేవలందించిన నాగయ్య సేవాగుణాన్ని వారు కొనియాడారు. అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు విద్యాభివృద్ధి విషయంలో అమూల్యమైన సలహాలు అందించి ఉపాధ్యాయులకు అండదండగా ఉన్న ఆయన పనితీరు పలువురికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు జె.గంగాధరబాబు, టి.రాజశేఖర్, ఎక్స్‌మస్ జాన్, షేక్ సిలార్ అహ్మద్, కిషోర్, నాగరాజు, రామారావు, కృష్ణానాయక్, డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



జాతీయ వైద్యుల దినోత్సవంలో వైద్యులు, రోటరీ క్లబ్ సభ్యులు



వైద్యులను సత్కరించిన రోటరీ క్లబ్ సభ్యులు




డాక్టర్ సదాశివరాజును సన్మానించిన కృష్ణవేణి స్కూల్ యాజమాన్యం, సిబ్బంది

మాచర్ల: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైవేటు వైద్యశాలల్లో ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. రోటరీ జిల్లా డిప్యూటీ గవర్నర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య ఆధ్వర్యంలో మెరుగైన వైద్య సేవలు అందించిన వైద్యుల సేవలను కొనియాడారు. సీనియర్ వైద్యులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో వైద్యులందరూ ఉత్తమ సేవలు పేదలకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా పట్టణంలోని వైద్యులను రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, కార్యదర్శులు పఠాన్ నాగూర్‌వలి, నిమ్మగడ్డ సురేఖలు అభినందించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని క్లబ్ కోశాధికారి ఎ.లక్ష్మి కోరారు. జాయింట్ సెక్రటరీ తుమ్మల రాధ, రోటరీ మాజీ అధ్యక్షులు చిన్ని సత్యనారాయణ, కర్నాటి వాసు, శివ మెడికల్స్ రామ్మూర్తి, పి.శ్రీనివాసరావు, మాచర్ల పట్టణ ప్రముఖ పిల్లల వైద్యులు ముడావత్ దశరథ్ చౌహాన్ ఆధ్వర్యంలో వైద్యులను అభినందించారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో...

మాచర్ల: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నేషనల్ డాక్టర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్య నిపుణులు మాచర్ల డివిజన్ ఆర్‌ఎంపీ అండ్ పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సదాశివరాజు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అన్ని వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి, వైద్య వృత్తి చాలా గొప్పవన్నారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం రామకృష్ణ, శ్రీధర్ గుప్తా, హరీష్ చంద్రలు మాట్లాడుతూ అనునిత్యం అందరికీ అందుబాటులో ఉంటూ అందరి మన్ననలు పొందిన వ్యక్తి డాక్టర్ సదాశివరాజు అని కొనియాడారు. అనంతరం డాక్టర్ సదాశివరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జిలు గౌరి, నాగ జ్యోతి, శ్రీలక్ష్మి రెడ్డి, అంజి నాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రవికుమార్‌కు నట కళారత్న జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రవికుమార్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌కు దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పౌరాణిక నట కళారత్న జాతీయ పురస్కారం ప్రదానం చేశారు. గత నెల 30న తెలుగు వెలుగు సాహితీ వేదిక గ్రేటర్ వరంగల్ వారిచే కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ ఆడిటోరియంలో ఆంధ్ర, తెలంగాణ, ఒడిస్సా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర స్థాయిలో వివిధ రంగాలలో ప్రావీణ్యం గడించిన విద్యా, వైద్యం, సాహిత్యం, అర్చక, పురోహిత, రంగస్థల కళా రంగం, సమాజ సేవా రంగాలలో, భరత నాట్యంలో బాల, బాలికలకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా రవికుమార్‌కు శాలువా, పతకం, జ్ఞాపిక, ధ్రువపత్రం అందజేశారు. రవికుమార్ 2022 నుంచి 2024 జూన్ 30 వరకు 36 పురస్కారాలను రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో అందుకున్నారు. ఈ సందర్భంగా సత్తెనపల్లిలోని వివిధ కళా పరిషత్తుల వారు రవికుమార్‌ను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

పెన్షన్ల పంపిణీలో పాటించని ప్రొటోకాల్

సత్తెనపల్లి: ప్రభుత్వం లబ్ధిదారులకు అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ డబ్బులను ఏ అర్హత లేని కొందరు టీడీపీ నాయకులు.. ప్రభుత్వానికి సంబంధం లేని కొందరు వ్యక్తులు పంపిణీ చేయడం చూస్తూ ఉంటే ఆశ్చర్యకరంగా ఉందని పలువురు కౌన్సిలర్లు సోమవారం విమర్శలు వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులుగా గెలుపొందిన కౌన్సిలర్లకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ప్రొటోకాల్ పాటించకుండా పెన్షన్లు పంపిణీ చయడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో ప్రైవేట్ వ్యక్తులకు ఏమిటి సంబంధం అని ప్రశ్నించారు. కనీసం అధికారులైనా ఇలాంటి విషయాలలో జాగ్రత్తలు తీసుకోకపోవడం దౌర్భాగ్యం అని, దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని పలువురు కౌన్సిలర్లు తెలిపారు.

డయేరియా నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పిడుగురాళ్లరూరల్: కలుషితమైన ఆహారం, నీరు వలన డయేరియా వస్తుందని అందుకే సురక్షితమైన ఆహారం, నీరు తీసుకోవాలని కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కేవీ ప్రవీణ్‌రెడ్డి, నాగిరెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, కరాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను స్టాప్ డయేరియా వంటి కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. విద్యార్థులకు డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పటం ద్వారా డయేరియా ప్రబలకుండా ఉంటుందని వారు తెలిపారు. డయేరియా నిర్మూలలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలియజేశారు. అనంతరం గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రకాష్, ఎంఎల్ హెచ్‌పీఎస్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ప్రభాకర్, శౌర్లు, సురేష్, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు డాక్యుమెంట్ సృష్టించిన వారిపై కేసు నమోదు

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమ ఆస్తులను అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆస్తులను ధ్వంసం చేసి పదే పదే దాడులకు పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తులపై సత్తెనపల్లి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ప్రస్తుత మఠాధిపతి చింతాడ లలితాంబ మాతాజీ తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలోని గుంటూరు రోడ్‌లో 1939లో చింతాడ సూర్య ప్రకాష్‌రావ్‌చే నిర్మించబడిన శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమానికి దాతలు 2.70 ఎకరాల భూమిని 1966లో ఆశ్రమ మఠాధిపతి గురూజీ పేరుతో రిజిస్టర్ చేశారు. కొందరు ఆశ్రమ ఆస్తులను ఆక్రమించాలని తప్పుడు డాక్యుమెంట్లు తయారుచేసి అధికారులను మోసం చేసి ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలులో ఆశ్రమంలో అంతర్భాగంగా ఉన్న సుమారు 48 సెంట్ల భూమిని రిజిస్టర్ చేసుకున్నారు. దీనిపై పదేపదే ఆక్రమించాలని రౌడీలు, గూండాలతో దాడి చేయడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాం. దీనిపై విచారించిన పోలీసులు కుట్ర, అక్రమ చొరబాటు, తప్పుడు డాక్యుమెంటరీ సృష్టి, ఆశ్రమ నిర్వహణకు ఆటంకం కలిగించటం, చంపుతామని బెదిరించడం తదితర సెక్షన్లపై కట్టమూరి విజయ వెంకట లక్ష్మినరసింహారావు, పెద్దిరెడ్డి గోవిందరెడ్డి, పెద్దిరెడ్డి మంగమ్మ, పెద్దిరెడ్డి దీపిక, కల్లి అంజిరెడ్డి, మరి కొందరిపై విచారణ చేస్తున్నారు. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు ఆశ్రమ ఆస్తులను పరిరక్షించాలని, దాడులు చేస్తున్న వారి నుంచి తమను కాపాడాలంటూ విజ్ఞాపన పత్రాలను అందజేయగా, వారు ధైర్యానిచ్చారు. గతంలో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి గుంటూరు కోర్టులో, సత్తెనపల్లి కోర్టులో దావాలు వేయగా 1966 డాక్యుమెంట్ ప్రకారం 2.70 ఎకరాలు ఆశ్రమానికి సంబంధించినవేనని న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చాయని, శాశ్వత ఇంజక్షన్ ఆర్డర్లు ఇచ్చాయని ఆమె తెలిపారు. ప్రస్తుతం భూ కబ్జాదారులు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న స్థలంలో వేద పాఠశాల, వాసవి నగర్ ప్రధాన రహదారి, అర్చకుల నివాసగృహం ఉన్నాయన్నారు.

నేటి నుంచి మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో మూగజీవాలకు నీలినాలుక వ్యాధి నిరోధక టీకాలు మంగళవారం నుంచి వేస్తున్నట్లు మండల పశు వైద్యులు డాక్టర్ మల్లయ్య సోమవారం తెలిపారు. తొలిరోజు బయ్యవరం, అనంతవరం గ్రామాలు, 3వ తేదీ ఊటుకూరు, దొడ్లేరు గ్రామాలు, 4న అందుకూరు, హసనాబాద్, 5వ తేదీ క్రోసూరు, గుడిపాడు, 6న 88త్యాళ్లూరు, అవులవారిపాలెం, 8వ తేదీ ఉయ్యందన గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు తెలిపారు. మూగజీవాల పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు.


రైతులకు విత్తనాలు అందజేత

బెల్లంకొండ: ప్రభుత్వం ద్వారా రైతులకు అందించే రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన బెల్లంకొండలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఏపీ సీడ్స్ వారి నుంచి ఖరీఫ్ 2024 సాగుకు రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య మాట్లాడుతూ కంది విత్తనాలు 30 శాతం రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. ఎకరాకు 4 కేజీలు విత్తుకోవాలని 4 కేజీల విత్తనాల పూర్తి ఖరీదు రూ.559.20 కాగా రాయితీ 30 శాతం పోగా రైతు వాటాగా రూ.391.44 చెల్లించాలన్నారు. రైతులు సిబ్బందిని సంప్రదించి విత్తనాలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి పీయస్కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్ గడిపర్తి జ్యోతి సముద్రం, రైతులు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తత అవసరం

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): అతిసార ప్రమాదకరమైందని, లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ముప్పాళ్ళ పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లోను స్టాప్ డయేరియా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. చాగంటివారిపాలెంలో జరిగిన ర్యాలీలో ఆమె పాల్గొని విరేచనాలు రెండు, మూడు సార్లు కంటే ఎక్కువగా అయితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. చిన్నపిల్లల్లో తల్లి పాలు తాగకపోవడం, తక్కువగా తాగడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. తరచూ అనారోగ్యానికి గురవుతూ ఉంటారన్నారు. అతిసార వ్యాధి వస్తే ఓఆర్‌ఎస్, జింక్ టాబ్లెట్‌లు వాడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సూపర్‌వైజర్ పీటర్ డేమియన్, జోస్పిన్ రాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన



రాజుపాలెం: ఐదేళ్ల లోపు చిన్నారులలో ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా వ్యాధిని నిరోధించి మరణాల బారిన పడకుండా ఉండేందుకు ఆరోగ్య సిబ్బంది నివారణ చర్యలు చేపట్టినట్లు హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డయేరియా నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఓఆర్‌ఎస్, జింక్ కార్నర్ సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు మండలంలోని అన్ని గ్రామాలలో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా ఐదేళ్లలోపు పిల్లలున్న తల్లిదండ్రులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లను అందించారు. తల్లిదండ్రులకు డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, స్టాఫ్ నర్సు చందన, ఫార్మసిస్టు శివాంజనేయులు, ఆరోగ్య కార్యకర్తలు రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.